శారద

# క్షణంలో సగం

ముందు ఈ భూమిని నాకు వ్రాసి ఇవ్వండి. అందరికీ సమానంగా పంచుతున్నాను. కులాలు లేవు. కాని కమ్యూనల్ జి. వో. వుండాలి. అందరికీ ఒంటినిండా గంజి; నోటినిండా గుడ్డ. విప్లవ పంథాలో. బురదలో భరతనాట్యం వలె పదను తొక్కవచ్చు. భూమిని గురించి కలలు. చేసిస్తాను, అందరూ పుచ్చుకోండి. కాని, అవి చేసిచ్చేట్టయితేనే అందరికీ పంచుతాను. నాశాస్త్రం ప్రకారం చేసిచ్చే ప్రణాళికను అనుసరించండి.

చూడండి ఈ విశాల భావం ఎంత కొత్తగా వుందో! దీన్నేమనుకున్నారు? ధగ ధగ మెరుస్తోంది. ఎక్కణ్ణించి పట్టుకొచ్చానని భయపడకండి. మీ అనుభవ పరిధిలోనే వున్న ఆదర్శమే. చెవులు గింగురుమనేట్టు నినాదరావు అరుస్తూనే ఉన్నాడు.

అరవటం ఉపన్యాస మివ్వటానికి పర్యాయపదం. మంత్ర రహస్యం. ఎలక్షన్ అంటే ఏమిటి అంటుంది నా అభిమానపు దీపం. పాత కార్డు మరామత్తు. రణగొణ ధ్వనిలో పెట్రోల్ రేషన్ రద్దు.

ఆలోచించటం జబ్బన్నాడు డాక్టర్. మెదడు ఉండటం పొరపాటు. ఆడవాళ్ళకి ఉన్న ఒక్క సుగుణం కులుకు చూపడంలాగ వుంది. స్త్రీ స్వాతంత్ర్యం ఇస్తే రాగల పురోభివృద్ధి సోషలిజానికి తోడ్పడుతుందా అని నినాదరావు పుస్తకం రాస్తాడు. నిన్నటికి రేపు కొత్త. పాత వ్యవస్థకి, మరీ పాత వ్యవస్థమీద మోజు.

చంకలపైన వుండే రవికలు మోచేతికి దిగినై. చిన్న తిండి అరక్క తినటం మానేసినట్టు, నీకు తెలివి ఎక్కువై తన్నులు తగిలేట్టయితే, బుర్ర అద్దెకిచ్చివేయి. లేకపోతే పత్రిక పెట్టు. పేజీలు ఖాళీగా వొదిలి, ఎవడి కిష్టంవొచ్చింది వాణ్ణి రాసుకుని చదువుకోమను. అదీ ప్రజాస్వామ్యం. నీ పత్రికకి పేరు పెట్టకు. ఎవడి పేరు వాడికే వుణ్ణియ్యి.

సహారా ఎడారిలో జలపాతం పొంగుతున్నది. కొరియా యుద్ధం అమెరికాలో జరుగుతున్నది. వాసన లేని పువ్వుకి నిగనిగ ఎక్కువ. ప్రజాస్వామ్యం మార్కు బాంబులు చాలా మంచివి. టైముకి చక్కగా పేలుతాయి. వాటినే ఉపయోగించు. ఏ పనీ లేనివాళ్ళని వ్యాసాలు రాయమనటం కేంద్ర ప్రభుత్వానికి మంచిది. పిల్లకాయల్ని రాజకీయాలు చదివిస్తే, పుస్తకాలే వాళ్ళని చదువుతున్నాయి. ప్రధాన మంత్రి ముఖ్యమంత్రి ఐనప్పణ్ణించీ, ఆలిండియా రేడియో, "తెల్గూమే ఖబర్ బోలే హై" అని హిందీ తెలుగు సంయుక్తాభివృద్ధికి శక్తివంచన లేకండా పాటుపడుతున్నారు.

నీకు హిందీ రాకపోతే, పొలిక చెట్లు నాటు. పర్మిట్లు వొస్తాయి. లేదా నూలు ఒడుకు. కుదరదా ఇంకోడి చాత వొడికించు. కాని, చెట్లు నాటి ఫోటో తీయించుకో. ఓపిక వుంటే హిందీ చదవటం, చెట్లు నాటటం, నూలు వొడకటం ఇవన్నీ ఒక రోజు జీవితం ఫిలిం తీయించుకో. నీకు సిమెంటు కావాలా? సెక్రటేరియట్ చుట్టూ రాంభజన చేస్తూ తిరుగు. రేషన్ కావాలా? సేవింగ్సు సర్టిఫికేట్లు కొని నీ ఇల్లాలికియ్యి. వండి వారుస్తుంది.

మీఅబ్బాయి పరీక్షలో తప్పాడు. యూనివర్సిటీ లంచాల డిపార్టుమెంటుకి అప్లికేషన్

పెట్టు. నీకు అబ్బాయి లేడూ? నువ్వే ఎస్. ఎస్. ఎల్. సి. చదువుతున్నావా? అయితే ఆ పుస్తకంలో ఏముందో రాసినవాడికే తెలీదు. అయితే వేదాంతం ఎవడికీ తెలీకపోవటంలోనే గొప్పతనం ఉంది.

పరీక్షలు నీకు ఇష్టంలేదా? సిక్ లీవ్ రాయి. నీకు విశ్రాంతి కావాలా? పెళ్ళానికి విడాకు లివ్వు. అమెరికాలో తయారైన కృత్రిమ బుర్రలు బజారులో చవకగా దొరుకుతున్నాయి. వాటిని కొని చిల్లరగా మహాసభ పెట్టి అమ్ము.

మహాసభల్లో మైకులుంటాయి. మనుషులకి అరవటానికి ఇవి చాలా కావాలి. అదన్నా అరపండే ప్రచారంకాదు. నిన్ను చూస్తే నాకు జాలి. నీకు బుద్ధి వేడెక్కి శరీరం చల్లబడింది. కాళ్ళుమండి మొహం నల్లబడింది.

సంఘం నీకు బాబు. సంఘంలో నీతిగా బతుకు. దొంగతనం చేసి పట్టుపడకు. ఏ పరిస్థితుల్లోనూ ఉత్తరీయం మర్చిపోకు. లోకం మరమ్మత్తుకి పనిముట్లు లేవు. లోకంలో భూమిని దున్నేవాళ్ళకి పంచటానికి నువ్వెవడివైనా ఇబ్బంది లేదు. ఆహారమంత్రివైతే చెట్లు నాటించు. యుద్ధమంత్రివైతే యుద్ధం చేయించు. విద్యామంత్రివైతే ముందు స్కూళ్ళు మూయించి, పంతుళ్ళందర్నీ ఉరి తీయించు. జీతాలు తప్పుతై. ఏ కుర్రాడి చదువు వాణ్ణే చదవమను. స్కూళ్ళు ఖాళీచేయించి పోలీసు స్టేషన్లూ, హోటళ్ళు మూయించి కమర్షియల్ టాక్స్ ఆఫీసులూ పెట్టించు. నీకు ఇదే నా జోహార్!

# ప్రజా స్వామ్యపు ధగధగలు

యం. యస్. చలం

ఈ మధ్య నా మిత్రు డొకడు చేత వార్తా పత్రిక ధరించి నావద్దకు వచ్చాడు. అతని ముఖం పున్నమినాటి చంద్రునివలె ప్రకాశమానంగా వుంది. మందహాసం పెదవులపై చిందులాడుతోంది. వస్తూవస్తూనే వాడు చేతనున్న దిన పత్రికను నామీదకు విసిరి 'నువ్వు ఎన్నాళ్ళుగా తన్నుకుంటున్నా నీపేరు మాస, వార పత్రికలను దాటిపోలేదు. మన కీర్తి యేకంగా దిన పత్రికలకు ప్రాకిపోయింది.' అన్నాడు. విషయ మేమిటో అర్థంకాక ఒక్క క్షణం స్తబ్ధత వహించి 'ఏమైనా వ్రాశావా?' అన్నాను. అతడు వ్రాయసకాడుగా రాణించాలని ప్రయత్నించే దుర్బలుడు కాదని నాకు తెలిసినా, ఆ బలహీనత నాకు వుండటంవల్ల నేను అలా అనవలసి వచ్చింది.

తరువాత వాడు చెప్పిన దానినిబట్టి విషయం పూర్తిగా గ్రాహ్యమయింది. వాడు కాంగ్రెస్ పంచాయితీ యెన్నికలలో పోటీలేని విజయం పొందాడు. దిన పత్రికలలో వాడి నామం చక్కని అక్షరాలలో ముద్రణ జరిగింది. ఇది వాడి ఆనందానికి కారణం.

ఇలాంటి విషయాలకు తన్మయులయ్యే వ్యక్తుల పట్ల మనం చులకన దృష్టి ప్రదర్శించ కూడదు. వాళ్ళ ఆనందానికి ప్రబల కారణాలు లేకపోలేదు. ఈనాడు దినపత్రికల ముఖంగా పంచాయితీ సభ్యులుగా లోకానికి పరిచయం కాబట్టి యీ వ్యక్తులు క్రమక్రమంగా రాష్ట్ర సభ్యులుగా, అధ్యక్షులుగా, ఆపైన మంత్రులుగా ఆతరువాయి దేశానికే అధినేతలుగా పరిచయం కావచ్చు. భవిష్యత్తులో వారు ఆసీనులు కాబోయే పున్నత శిఖరాలకు యిది ప్రథమ సోపానంగా వారు భావించటంలో ఆశ్చర్య మేముంది? ప్రస్తుత పరిస్థితులను కూలంకషంగా పరిశీలించే వారికి భావిభారత భవిష్యత్తు వీరి మీదనే ఆధారపడి వున్నదని తోచకపోదు!

ఇక దినపత్రికలో పేరు అచ్చుకావటం అంటే సామాన్య విషయంకాదు. దిన పత్రిక లంటే-ధరణీ చక్రాన్ని శాసించే మహానీయుల క్రీడా రంగాలు. ప్రబల బలసమన్వితమైన వీటి కరుణా కటాక్షం సంపాదించిన అల్పుడుసైతం పున్నత శిఖరాలలో విహరించగలడు. ఎంతటి విఖ్యాత బలవంతుడైనా వీటి కన్నెర్రకు గురి